THE WORD OF TRUTH

# సత్యవాక్కు

క్రైస్తవ మాసపత్రిక

## రేడియో శ్రీలంక ద్వారా క్రీస్తు సంఘముల
## సువార్త ప్రసారములు

**తెలుగు — SATYA VANI**

ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో
మధ్యాహ్నం గం 2-30 కు

**హిందీ — SATYA SUSAMACHAR**

| | |
|---|---|
| మంగళవారము<br>గురువారము<br>శుక్రవారము | 9-00 to 9-15 p. m. |
| శనివారము | — 1-30 to 1-45 p. m. |

**ఇంగ్లీషు — The Voice of Truth**

ఆదివారము —9-30 to 9-45 p. m.
మంగళవారము — 9-30 to 9-45 p. m.

**తమిళం — SATYA VAZHI**

మంగళవారము — 5-30 to 5-45 p. m.
గురువారము — 6-45 to 7-00 p. m.
శుక్రవారము — 6-45 to 7-00 p. m.

**మళయాళం — The Voice of Truth**

మంగళవారము — 3-45 to 4-00 p. m.
శుక్రవారము — 3-45 to 4-00 p. m.

ఈ కార్యక్రమములను అందరు వినండి. అందరికి విన్పించండి.
తెలుగు, ఇంగ్లీషు భాషలలో లభ్యమగు ఉచిత బైబిలు కరస్పాండెన్సు కోర్సు కొరకు ఈ దిగువ చిరునామాకు వ్రాయండి.

**S A T Y A V A N I**
P. O. Box 80, KAKINADA-533 001

Razan Press, Kakinada.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

**P. O. Box. 80, KAKINADA-533 001.**

*Editor* — J. C. CHOATE

*Managing Editor* — JOSHUA GOOTAM

Pleading for restoration of pure New Testament Christianity

సంచిక **3** అక్టోబరు **1981** సంపుటి **2**


## సంపాదకీయము

### బైబిలు - దేవుని వాక్యము

*( The Bible – the Word of God )*

బైబిలును గూర్చి నీ భావమేమిటి? అది ప్రపంచములో అత్యధికముగా అమ్ముడగుచున్న గ్రంథమని నీకు తెలుసా? అది వందల కొలది భాషలలోనికి తర్జుమా చేయబడినది. ప్రపంచమందున్న మిగతా భాషలన్నిటిలోనికి దానిని తర్జుమా చేసేపని ప్రస్తుతము కొనసాగుచుయున్నది.

ఈ గ్రంథమును గూర్చిన అనేక ప్రాథమిక విషయములను నేను నీతో పంచుకొనగోరుచున్నాను. నీకు ఇంకా ఒక బైబిలుగాని క్రొత్త నిబంధనగాని లేని యెడల దాని కాపీ నొకదానిని నీవు సంపాదించుకొనుట మంచిది.

మొదటిగా, బైబిలు దైవాత్మావేశ లేఖనమై యున్నది. "ఒకడు తన ఊహను బట్టి చెప్పుటవలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని

మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:20, 21). దేవుని చిత్తమును లిఖించుటలో పరిశుద్ధాత్ముడు కొందరిని ఎన్నుకొని వారిని నడిపించెను. ఆ లేఖనములు భద్రపరుపబడి మానవజాతి కంతటికీ లభ్యపరుపబడినవని దీని యర్థము. ఈ గ్రంథమును చదువునప్పుడు మనము కేవలము మానవమాత్రుల ఆలోచనలను, వ్రాతలను గాక దేవుని యొక్క చిత్తమునే చదువుచున్నామని దీని యర్థము. అందువలననే మనము దానిని గౌరవించి దాని బోధలకు లోబడవలెను. అపొ. పౌలు ఈ విధముగా చెప్పి దీనిని బలపరుచుచున్నాడు: "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశమువలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్షచేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమో 3:16, 17).

రెండవదిగా, ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. అపొస్తలుడైన పేతురు ఇట్లనుచున్నాడు: "మీరు క్షయబీజము నుండి కాక, శాశ్వతమగు జీవముగల దేవుని వాక్యమూలముగా అక్షయ బీజము నుండి పుట్టింపబడినవారు గనుక నిష్కపటమైన సహోదర ప్రేమ కలుగునట్లు మీరు సత్యమునకు విధేయులవుటచేత మీ మనస్సులను పవిత్రపరచుకొనినవారై యుండి, యొకని నొకడు హృదయపూర్వకముగాను, మిక్కుటముగాను ప్రేమించుడి. ఏలయనగా, సర్వశరీులు గడ్డిని పోలినవారు, వారి అందమంతయు గడ్డి పువ్వువలె ఉన్నది; గడ్డి ఎండును. దాని పువ్వును రాలును, అయితే ప్రభువు వాక్యము ఎల్లప్పుడు నిలుచును. మీకు ప్రకటింపబడిన సువార్తయీ వాక్యమే" (1 పేతురు 1:22-25). "ఆకాశమును భూమియు గతించునుగాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు" అని క్రీస్తు

చెప్పెను (మత్తయి 24:35). మానవ లిఖిత గ్రంథములకు అంతమే లేదు. అయితే అవి వచ్చిన రీతిగనే వెళ్ళిపోవును. ప్రసిద్ధి గాంచిన పుస్తకములుకూడ కొంతకాల మయ్యేసరికి వాడిపోవును. అయితే దేవుని వాక్యమైన బైబిలు మాత్రము అట్టిది కాదు. అది పరిశుద్ధ గ్రంథము. అది మానవునికి దేవుడిచ్చినది. అది అంతయు దైవావేశమువలన కలిగినది. ఈ జీవితంలో మానవుని మార్గదర్శియై అతనిని పరలోకమునకు తీసికొని వెళ్లుట కది ఉద్దేశించబడినది. అనేక సంవత్సరముల తరబడి నిలిచినట్టిది ఈ గ్రంథము. అది నిత్యము నిలుచునని, ఎన్నడు నాశనము గావించబడదని ప్రభువే చెప్పెను. అది మానవుని ప్రాథమిక అవసరములను తీర్చునట్టియు, అతనిని దేవుని యొద్దకు నడిపించుటకు ఉద్దేశించ బడినదియు గనుక, ఈ గ్రంథముల మార్పు అవసరతగాని, దానిని సవరించు అవసరతగాని లేనేలేదు. అందువలన అది సజీవమై యున్నది.

మూడవదిగా, మనము లేఖనములను చదివి పరిశోధించ వలెను. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" అని అపో. పౌలు యౌవన సువార్తికుడైన తిమోతిని హెచ్చరించెను (2 తిమో 2:15). "లేఖనములయందు మీకు నిత్యజీవము కలదని తలంచుచు వాటిని పరిశోధించుచున్నారు, అవే నన్నుగూర్చి సాక్ష్య మిచ్చుచున్నవి" యని యేసుక్రీస్తు చెప్పెను (యోహాను 5:39). దేవుని వాక్యమును చదువుట వలన, దేవుని చిత్తమును తెలిసికొనుటకు ఆసక్తి కలిగి లేఖనములను పరిశోధించుటవలననే మనము సత్యమును తెలిసికొని దానికి విధేయులము కాగలము. మనకు ఆ గ్రంథము లభించుట ఎంత ఆశ్చర్యకరమైన సంగతి!

నాలుగవదిగా, దేవుని వాక్యమునకు కలుపకూడదు, తీసివేయ

కూడదు అని మనకు హెచ్చరిక ఈయబడినది. అపొ. యోహాను ఇట్లు వ్రాసెను: "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్లు దేవుడు వానికి కలుగజేయును. ఎవడైనను ఈ ప్రవచన గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవవృక్షములోను పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రకటన 22:18, 19). దేవుని వాక్యమున కీయ వలసిన గౌరవమును ఈ మాటలు మరింత దృఢపరచుచున్నవి. బైబిలు దేవుని నుండి కలిగినది గనుక ఎవడైనను దానిని కదిపినా మార్చివేసినా దేవుడు వానిని సహించడు. అది ఉన్నరీతిగనే ఉంచబడవలెను. దానికి వేరుగా చేసిన యెడల దాని పర్యవసానము నెదుర్కొన వలెను.

అయిదవదిగా, దేవుని మహిమ ఘనతల నిమిత్తము ఫలములు ఫలించునట్లు స్త్రీ-పురుషుల హృదయములలో నాటబడిన విత్తనము దేవుని వాక్యము అని చెప్పబడినది. "విత్తనము దేవుని వాక్యము" అని క్రీస్తే చెప్పెను (లూకా 8:11). ఆ విత్తనము పవిత్ర క్రొత్త నిబంధన క్రైస్తవ్యమునే జనింపజేయును. అది ఆత్మ ఖడ్గమని కూడా చెప్పబడినది (ఎఫెసీ 6:17). అందువలన హెబ్రీ పత్రిక లేఖకుడు ఇట్లనుచున్నాడు: "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలము గలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గముకంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది" (హెబ్రీ 4:12). దేవుని వాక్యము మంచి చెడుగుల విచక్షణ చేయ గలదని, అది వాడియైనదని, శక్తిగలదని ఇరువైపుల తెగ నరుకుచు దూరగలదని దీని భావము. దానిని సరిగ నుపయోగించిన యెడల ఒకని జీవింపజేయుటకు, సంరక్షించుటకు అది ఉపయోగపడును;

అయితే అజాగ్రత్తగా వినియోగించిన యెడల అది నాశనము కావించు సాధన మగును.

ఆరవదిగా, మనము వాక్య ప్రకారము ప్రవర్తించువారై యుండవలెనని బోధింపబడినది. "మీరు వినువారు మాత్రమై యుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ వాక్య ప్రకారము ప్రవర్తించువారునై యుండుడి. ఎవడైనను వాక్యమును వినువాడై యుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలి యున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికిపోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా. అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరి చూచి నిలుకడగా ఉండువాడెవడో వాడు విని మరచువాడు కాక క్రియను చేయువాడై యుండి తన క్రియలో ధన్యుడగును" (యాకోబు 1:22-25). ఆత్మ యొక్క అద్దము దేవుని వాక్యమని ఈ వచనములలో లేఖకుడు చెప్పుచున్నాడు. ఒకడు అద్దములో చూచుకొనినప్పుడు తానున్న రీతిగనే తన్ను తాను చూచుకొనునని మన మెరుగుదుము. తన ఆకార మెట్లున్నదో తెలిసికొనుటకు అతడు దాని యొద్దకు పదే పదే వెళ్లుచు యుండును. అతడు అద్దము యెదుట నుండి కొంత కాలము దూరమైపోయిన యెడల తన ఆకార మెట్లున్నదో అతడు చివరకు మరచిపోవును. ఆత్మీయ అద్దమును గూర్చి కూడ ఈ సంగతి సత్యమే. ఒకడు దేవుని వాక్యమైన అద్దములోనికి చూచుచుండగా అతడు తన ఆత్మీయస్థితిని, అవుసరములను చూచుకొనగల్గును. అతడు దేవుని వాక్యమును విడచిన యెడల అతడా అవుసరములను మరచిపోవును, నశించిపోయే ప్రమాదములో యుండును. అందువలన దేవుని వాక్యములో నిలిచియుండుడని, వాక్యమును బట్టి ప్రవర్తించుడి యని యాకోబు మనలను హెచ్చరించుచున్నాడు, అట్లు చేసిన

యెడల మనము దీవించబడగలము. దేవుని వాక్యము ఆత్మ యొక్క అద్దము అనే భావము 1 కొరింథీ 13:12 లో కూడ వ్యక్తపరచ బడినది.

ఏడవదిగా, వాక్యమనే పాలను గూర్చి వాక్యమనే బలమైన ఆహారమును గూర్చి దేవుని వాక్యము చెప్పుచున్నది (1 పేతురు 2:2; హెబ్రీ 5:14). ఒకడు తిరిగి జన్మించినప్పుడు అతడు నూతనసృష్టి యగును. అతడు ఎదుగునట్లు అతనికి వాక్యమనే పాలు లేదా దేవుని వాక్యము నందలి సూక్ష్మబోధలు అతనికి అవుసరము. దీనివలన ఒకడు చివరిగా వాక్యమనే బలమైన ఆహారమును పొందగలడు లేదా దేవుని వాక్యమునందలి లోతైన మర్మములను గ్రహించుకొన గలడు. తద్వారా అతడు సంపూర్తిగా ఎదిగిన భావయుక్తమైన క్రైస్తవుడు కాగలడు.

ఎనిమిదవదిగా, దేవుని ఆజ్ఞలకు విధేయులైనవారు ఆశీర్వదించ బడుదురని వాగ్దానము చేయబడినది. "జీవ వృక్షమునకు హక్కుగల వారై, గుమ్మములగుండ ఆ పట్టణములోనికి ప్రవేశించునట్లు తమ వస్త్రములను ఉదుకుకొనువారు ధన్యులు" (ప్రకటన 22:14). వీటిలో సువార్త ఆజ్ఞలు (మార్కు 16:15, 16), మరియు క్రైస్తవ జీవనమును గూర్చిన ఆజ్ఞలు ఇమిడి యున్నవి.

తొమ్మిదవదిగా, దేవుని వాక్యమువలన మనకు తీర్పుతీర్చబడును; క్రీస్తు ఇట్లు అనెను: "నన్ను నిరాకరించి నామాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్యదిన మందు వానికి తీర్పు తీర్చును" (యోహాను 12:48). దేవుని వాక్యము చాల తీవ్రమైనది. ఒకనాడు అది మనకు తీర్పు తీర్చును. దాని నెట్లు మనము పరిగణింతుమో అట్లే అది మనలను పరిగణించును. అది ఇప్పుడెట్లు ఉన్నదో అట్లే అప్పుడు ఉండును. దానిని ఈ జీవితములో మనము నిర్లక్ష్యము చేసిన యెడల, నిరాకరించిన యెడల, అవిధేయత చూపిన యెడల తీర్పుదినమందు అది మనలను శిక్షించును. దానిని

మనము విశ్వసించి, విధేయత చూపి, దానికి నమ్మకముగా యున్న యెడల అది మనలను రక్షించి పరలోక గృహము ననుగ్రహించును. ఈ పర్యవేక్షణను బట్టి ఆ దినమందు దేవుని వాక్యము నిన్ను నన్ను ఎట్లు పరిగణించును ?

పైన చెప్పబడిన అంశములు బైబిలు దేవుని వాక్యమనే సత్యమును మరొకసారి వక్కాణించుటకును, పాఠకులు దానిని తీవ్రముగా నెంచి దానిని చదివి, ధ్యానించి, సరిగ నుపయోగించి దాని హెచ్చరికలను గైకొనవలెనని తెలియజేయుటకును చెప్పబడినవి. దాని గ్రంథకర్తయైన దేవుడు ప్రయోజనము లేకుండా దానిని మన కీయలేదు గాని మనలను ఆయనకును ఆయన చిత్తమునకును పరిచయము చేయుటకు, మనము నడువవలసిన మార్గమును మనకు చూపుటకు దానిని ఆయన మనకు యిచ్చెను. దేవుని వాక్యము సజీవమైనది. దానిని విశ్వసించి దానికి లోబడువారికి అది జీవము నీయగలదు. గనుక దానిని మనము దాచుకొనవలెను, గౌరవించవలెను, మన జీవితములను మార్చుటకు, మరల్చుటకు, దేవుని చిత్తప్రకారము ఉండువారిగా మనలను తయారు చేయుటకు దానికి తావీయవలెను. దేవుని వాక్యమైన బైబిలుతో సరి సమానముగా యున్న గ్రంథ మేదీకూడ ఈ లోకములో లేదు. దానిని పరిశోధించి నీకు నీవే కనుగొనుము.

---

## బైబిలు నిజమా ?

### *( Is the Bible True ? )*

"ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛను బట్టి కలుగలేదు గాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింప బడినవారై దేవుని మూలముగ పలికిరి" (2 పేతురు 1:21).

## నేను బైబిలును నమ్ముదును

దానిని విశ్వాసమువలన నేనంగీకరించెను. నేను మరణానంత రము జీవించుదునని అది బోధించుచున్నది. నేనొక శ్రేష్ఠమైన గృహమునకు వెళ్ళదలచుకొంటిని, శాకంటె ముందు వెళ్ళిపోయిన మిత్రులను బంధువులను కలసికొనవలెనని నేననుకొనుచుంటిని. బైబిలు నిజమని నా చిన్నతనము నుండి నాకు బోధింపబడినది. గతంలో యున్న గొప్ప పురుషులు బైబిలును అంగీకరించిరి. దానిని నమ్మకుం డుటకంటే, నమ్ముటయే సులువు.

## నేను దేవుని నమ్ముదును

నా స్తికత్వము నిరూపింపబడలేదు. దేవుడు లేడని తెలిసికొను టకు ఒకడు సమస్తమును ఎరిగి యుండవలెను. దేవునియందు నమ్మిక యుంచుట చాల యోగ్యమైనది. దేవుడు లేడని నమ్ముట చాల అయోగ్యమైనది. ఆయన ఉనికిని గూర్చి ఈ విశ్వము సాక్ష్యమిచ్చు చున్నది. ప్రతి యిల్లును ఏదైనా ఒకనిచే నిర్మింపబడి యున్నది. గడి యారమును తయారుచేసిన జ్ఞాని అంటూ ఒకడున్నాడు. దేవుడు చేసిన వాటిని బట్టి దేవుని గూర్చి మన మెరుగుదుము. ఆకాశమును, ప్రకృతిని మరియు ఒక పసిబిడ్డ ముఖమును ఒకసారి తిలకించి దేవుని పరికించుము. దీని యంతటి వెనుక ఒక గొప్ప నమూనాకారుడు (Designer), సాంకేతిక విజ్ఞానకోవిదుడు ఉన్నాడు. దీని గత్యంత రము ఏమిటి? నిరీక్షణ శూన్యము, జీవించుటకుగల లక్ష్యము సున్న. అది ఎంత భయంకరమైన, నిర్జీవమైన దృశ్యమో !

## 'దేవుని చూపించు, నేను నమ్ముదును'

పై విధముగా కొందరు వాదించుదురు. నీ మెదడు చూపించు, అప్పుడు నీకు కొంత మెదడున్నదని నమ్ముదును ! గాలిని చూపించు అప్పుడు దానిని నమ్ముదును. మహాత్మ గాంధిని చూపించు అప్పుడాయన

జీవించాడని నేను నమ్ముదును. మనము ప్రాణాన్ని గాక దాని ఫలితము లను చూచుచున్నాము. అల్లే నీమెదడు యొక్కయు, గాలియొక్కయు, గాంధీయొక్కయు పనిని మనము చూడగల్గుచున్నాము. దేవుడు చేసినవాటిని బట్టి మన మాయనను చూడ గల్గుదుము. ఆయన ఉని కిని గూర్చిన ఋజువులను ప్రతిచోట మనము చూచుచున్నాము.

## విచిత్రమైన బైబిలు లక్షణములు

కాలారంభము నుండి నిత్యత్వమువరకు అది మన మార్గదర్శియై యున్నది (కీర్త 119:105). అది ఎన్నడు నాశనము గావించబడదు (మత్తయి 24:35), ప్రతి సత్కార్యమునకు అది సంపూర్ణమై యున్నది (2 తిమో 3:16). అది దేవుని నుండి కలిగినది (హెబ్రీ 1:1, 2). అది మానవుని ఆద్యంతములను, అతని కృషిని, గమ్యమును బయలు పరచుచున్నది. మరో గ్రంథమేదియు వీటిని బయలు పరచలేదు. అది కాలపరీక్షలను జయించినది. వోల్టయిర్, పేయిన్, ఇంగెరుసాల్ లాంటి వ్యక్తులు దానిని నాశనము చేయబూని విఫలులైరి.

## బైబిలు లేఖకులు

బైబిలు 40 మంది లేఖకులచే 1600 సంవత్సరములలో వ్రాయ బడెను. అది ఒకే సంపుటిమైనను దానిలో 39 పుస్తకములు గల పాత నిబంధన, 27 పుస్తకములు గల క్రొత్త నిబంధన యున్నవి. దాని లేఖకులలో రాజులు, గొల్లలు, సైనికులు, జాలరులు, వ్యవసాయకులు కలరు. అది రాజభవనములలోను, గొల్లల గుడారములలోను, చెర సాల గదులలోను వ్రాయబడెను. బైబిలు లేఖకులు అందున్న వ్యక్తుల మంచి చెడుగులను రెంటిని గూర్చి తెలియ జేసిరి. అబ్రహాము, నోవహు, దావీదు, మోషే, పేతురు లాంటివారిని గూర్చి ఉదాహరణగా ఆలో చించుము. ఆయా వ్యక్తులలో ఎన్ని వ్యత్యాసములున్నను బైబిలు అంతయు ఒకే గ్రంథమై యున్నది. దానిలో స్వవిరుద్ధ సంగతు లేమీ లేవు.

## బైబిలు ప్రభావము

దాని నైతిక ప్రభావము దేశదేశాలకు ప్రబలియున్నది. నాగరికత పయనించవలసిన త్రోవను అది చూపించినది. మానవ స్వాతంత్ర్యము అభివృద్ధి జెందినది. స్త్రీ స్థానము హెచ్చించబడినది. కృషి చేయు కార్మికునికి మద్దత్తు ఈయబడినది. కృషియే గౌరవమనే సంగతి గుర్తించబడినది. కళా సాహిత్యములు, విద్య మొదలగునవి విస్తరించబడెను. దీనియంతటికి తప్పక ఒక కారణ ముండవలెను. అదేమంటే బైబిలు దేవుని నుండి కలిగెను!!!

## అది రక్షణ సంకల్పమును బయలుపరచుచున్నది

"మనుష్యుని ద్వారా మరణము వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానమును కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే క్రీస్తునందు అందరు బ్రదికింప బడుదురు" (1 కొరింథీ 15:21,22). పరదైసునుండి పరదైసువరకు చెప్పబడుచున్న కథ కథలన్నిటికంటే ప్రఖ్యాతిగాంచినట్టిది. అది మర్త్యుడగు మానవుడు ముందెన్నడు విననట్టి గొప్ప వర్తమానము. క్రీస్తు రక్తము ఇమిడియున్న ఈ కథలో మానవుడు రక్షింపబడవలెనంటే విశ్వాసముంచవలెనని (యోహాను 8:24), మారుమనస్సు పొందవలెనని (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనవలెనని (రోమా 10:10), మరియు బాప్తిస్మము పొందవలెనని బయలుపరచబడియున్నది (అపో.కా. 2:38).

## తీర్పు తీర్చు స్థాయి అది

"మరియు గొప్పవారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడి యుండుట చూచితిని. అప్పుడు గ్రంథములు విప్పబడెను. మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను; ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వాటిని బట్టి

తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:11,12).
ఆ దినమందు ఒక్కొక్కరి పేరు పిలువబడుచుండగా మనందరము అక్కడ యుందుము. ఇప్పుడు బైబిలులో ఏమి వ్రాయబడియున్నదో అప్పుడుకూడ అదే వ్రాయబడియుండును. దాని పరిశుద్ధ ఆజ్ఞలయెడల మనకున్న భావమును బట్టి మనందరి నిత్యగమ్యము నిర్ణయించబడును.

## దాగలినుండి ఒక పాఠము

"గతి సాయం సమయమున కంసాలి వాని కొమ్మము దగ్గర నుండి వెళ్లుచు వాని దాగలినుండి వచ్చు ధ్వనిని వింటిని. లోపలికి తొంగిచూచి అనేక సంవత్సరముల కాలమునుండి వాడబడి అరిగి పోయిన సుత్తెలు నేలమీద పడియుండుట చూచితిని. 'ఇన్ని సుత్తెలను పడగొట్టుటకు నీవు ఎన్ని దాగళ్లు (anvils) వినియోగించితివి?' యని నేనతని అడిగితిని'. 'ఒకే ఒక్కటి! దాగలి సుత్తెలను అరుగ గొట్టి పడగొట్టునుగదా' యని అతడు ప్రశ్నించు చూపుతో జవా బిచ్చెను. అట్లే దేవుని వాక్యమనే దాగలిపై సందేహాశీలురి దెబ్బలు తరములబడి పడుచునే యున్నవి. పడుచున్న దెబ్బల శబ్దము వినబడు చున్నను, దాగలికి హాని యేమియును కలుగలేదు గాని సుత్తెలు పడి పోయెను అని నేననుకొంటిని".

## 'బైబిలులో ....'

బైబిలులో దేవుని చిత్తము, మానవునిస్థితి, రక్షణ మార్గము, పాపుల నాశనము, విశ్వాసుల సంతోషము బయలుపరచబడి యున్నవి. దానిబోధ పరిశుద్ధమైనది, ధర్మవిధులు బద్ధమైనవి, దాని చరిత్రలు యథార్థములు, దాని నిర్ణయములు స్థిరములు. జ్ఞానివగుటకు దానిని చదువుము, సురక్షితుడవగుటకు దానిని విశ్వసించుము, పరిశుద్ధుడ వగుటకు దానిని పాటించుము. నిన్ను నడిపించుటకు దానిలో వెలుగు, పోషించుటకు ఆహారము, సంతోషపెట్టుటకు ఆదరణయు ఉన్నది. అది ప్రయాణికుని మార్గదర్శి, యాత్రికుని దండము, నావికుని దిక్సూచి,

సైనికుని ఖడ్గము, క్రైస్తవుని రాజశాసనము. దానిలో పరలోకము తెరువబడెను, నరకద్వారములు కనుబరచబడెను. క్రీస్తు దాని గొప్ప అంశము, మన మేలు దాని సంకల్పము మరియు దేవుని మహిమయే దాని ధ్యేయము. అది మన మనస్సులో నింపబడవలెను, హృదయమును ఏలవలెను, మన పాదములను నడిపించవలెను.

దానిని నెమ్మదిగా, జాగ్రత్తగా, ప్రార్థన పూర్వకముగా చదువుము. అది సంపదలగని, ఆత్మకు ఆరోగ్యము, ఆనంద నది. అది ఇక్కడ ఈ జీవితములో నీకీయబడినది, తీర్పులో తెరువబడును మరియు నిత్యము స్థిరముగా యుండును. దానిలో అత్యున్నతమైన బాధ్యత, అత్యుత్తమ పరిశ్రమకు ఫలితము ఇమిడి యున్నవి. మరియు దాని విషయములను అలక్ష్యము చేయువాని నది ఖండించుచున్నది.

మీ వూరిలో క్రీస్తుసంఘముల కూటములకు హాజరు కమ్ము !!

— Dr. జార్జి డిహాఫ్.

---

## బైబిలు యొక్క దైవావేశము

## (*The Inspiration of the Bible*)

— B. C. గుడ్‌పాశ్చర్

బైబిలు మానవాలోచన యొక్క ఫలితమా? అది కేవలము ఒక సాహిత్య గ్రంథమేనా లేక దైవావేశ సంపుటియా? అది దైవావేశమువలన కలిగినట్లయితే ఏరీతిగ కలిగెను? అది ఆవేశపూరితమైతే సాహిత్య విజ్ఞులగు షేక్స్పియర్, మిల్టన్, బ్రౌనింగ్‌ల వ్రాతలలో యున్నట్టి గుణగణములు మాత్రమే అందున్నవా? లేక పరిశుద్ధాత్మ ప్రభావమువలన మానవులచే లభింపబడిన రీతిగ అది ఆవేశపూరితమా?

దివ్య ప్రేరణను గూర్చిన ప్రశ్న ప్రాముఖ్యమైనది. బైబిలు దేవునివలన కలుగనట్లయితే అది చెప్పు వాస్తవములపై మనమాధార పడలేము. అధికారము కలిగియున్నట్లగుపడు దాని ఆరోపణలకు మనము

తలవంచ నక్కరలేదు; మరియు దాని వాగ్దానముల నుండి మనము ఆదరణ నిరీక్షణలను పొందలేము. అనావేశ మానవుల కృషికది సాదృశ్యముగా మాత్రమే యుంటే దానిలోని సంగతులను మనము లక్ష్యపెట్ట నక్కరలేదు. అట్లుకాక బైబిలు దేవుని నుండి కలిగినట్లయితే దాని యధికారము ప్రశ్నింపతగనిది, దాని యందలి సంగతులు సత్యములు.

## బైబిలు దైవావేశమును ఆరోపించుకొనుచున్నది

బైబిలు తత్వమును దానియందలి సంగతులను బట్టి అన్ని తరములలోను దాని చదువరులు దేవుడే దాని గ్రంథకర్తయని గుర్తించిరి. వ్రాయగలిగినను మానవుడటువంటి గ్రంథమును వ్రాయలేడు; అతడు వ్రాయాలనుకున్నను వ్రాయలేడు. దాని ఆకారములోను, తత్వములోను, బోధలోను అది మానవాతీతమైనది. ఈ లోకసంబంధమైన ఆశను, ఇచ్ఛను అది తాపీయదు. మానవులు శరీర సబంధముగా ఆశించువాటి నెక్కువ అది ఖండించుచు, వారు ద్వేషించు వాటిని శ్లాఘించుచున్నది. దాని తలంపులు మానవ తలంపులుకాదు.

అంతేకాదు, బైబిలు దైవావేశ పూరితమని తననుగూర్చి చెప్పుకొనుచున్నది. "ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు" "దేవుడు మాట్లాడెను" "యెహోవా వాక్కు ప్రత్యక్షమై ఈలాగు సెలవిచ్చెను" "అని యెహోవా సెలవిచ్చెను" అను పదములు సామాన్య చదువరులు కూడ బైబిలునందు సులభముగ గమనించి వార్షించగలరు. ఈ పదజాలములు ప్రవక్తల గ్రంథములలోనే 1300 సార్లు కనబడుచున్నవి. పాత నిబంధన యంతటిలోను ఈ పదములు 2500 సార్లు కనబడుచు బైబిలు గ్రంథకర్త దేవుడేయని సూచించు చున్నవి.

బైబిలు లేఖకులు అతి స్వల్పముగా వెలిగించబడిన మానవ జ్ఞాన వెలుగుతో తప్ప మరొక వెలుగుతో వారు వ్రాసినట్లు ఎన్నడు

నటించలేదు. వారు పరిశుద్ధాత్మతో నడిపింపబడిన వారై వ్రాసినట్లు చెప్పుకొనిరి. బైబిలు దానిలోని వివిధ భాగములు సర్వశక్తిమంతుని సహాయముతో ఈయబడెనని చెప్పియుండిరి. అపొ.పౌలు ఇట్లనెను : “దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పుదిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది” (2తిమో 3:16,17). ‘ప్రతిలేఖనము’ అని పౌలు చెప్పెను. కొంత భాగము మాత్రమే దైవావేశము వలన కలిగెనను సిద్ధాంతము నతడు యెరిగియుండలేదని మనకు ఋజువగు చున్నది. ఆధునిక వేత్తలు “బైబిలులో దేవునివాక్యమున్నది” యని చెప్పుదానికి అతడు చెప్పినది భిన్నముగా యున్నది. పౌలు ప్రకారమయితే బైబిలు దేవుని వాక్యమై యున్నది. అదంతయు దైవావేశమువలన ఈయబడెను. “ఒకడు తన ఊహానుబట్టి చెప్పుట వలన లేఖనములో ఏ ప్రవచనమును పుట్టదని మొదట గ్రహించుకొనవలెను. ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడిన వారై దేవుని మూలముగ పలికిరి” యని పేతురు ప్రకటించెను (2 పేతురు 1:20, 21). మోషే విమోచకునిగాను, ధర్మశాస్త్రదాతగాను పనిని ఆరంభించ బోవుచుండగా అతనితో దేవుడు, “కాబట్టి వెళ్లుము, నేను నీ నోటికి తోడై యుండి నీవు ఏమి పలుకవలసినది నీకు బోధించెదనని అతనితో చెప్పెను” (నిర్గమ 4:12). తన జీవితాంతమందు దావీదు, “యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు, ఆయనవాక్కు నానోటనున్నది” యని సాక్ష్యమిచ్చెను (2 సమూయేలు 23 : 2). “ఇదిగో నేను నీనోట నా మాటలు ఉంచియున్నాను” అని యెహోవా యిర్మీయాతో అనెను (యిర్మీయా 1:9). పాతనిబంధన అంతయును సత్యమని యేసు సమ్మతించెను. “మోషే ధర్మశాస్త్రము

లోను ప్రవక్తల గ్రంథములలోను, కీర్తనలలోను నన్నుగూర్చి వ్రాయబడిన వన్నియు నెరవేరవలెనని" ఆయన చెప్పెను (లూకా 22:44). యూదుల వాడుక ప్రకారము ఈ మూడు భాగములు, అనగా మోషే ధర్మశాస్త్రము, ప్రవక్తల గ్రంథములు, కీర్తనలు అంతా కలసి పాతనిబంధనాయెను. అంతేకాకుండా, బైబిలు శత్రువులు ఎక్కువ ఏ భాగములపై దాడి చేయుచున్నారో బైబిలులో ఆ భాగములు సత్యములని యేసు సమ్మతించెను. సృష్టి కథనము (మత్తయి 19:3), జలప్రళయ సంఘటన (మత్తయి 24:39), మరియు యోనా తిమింగలము యొక్క కథనములు (మత్తయి 12 : 40) యథార్థమని ఆయన తన ఆమోదముద్రను వాటిపై నుంచెను. అరణ్యములో ఆయన అపవాదిచే శోధింప బడినప్పుడు ఆధునిక వేత్తలు (Modernists) ప్రశ్నించుచున్న ద్వితీయోపదేశ కాండములో నున్న లేఖన భాగముల నెత్తి చెప్పుటద్వారా వానిని పారద్రోలెను. అరణ్యములో అది ఓడింపబడినప్పటి నుండియుకూడ ద్వితీయోపదేశ కాండము బైబిలులో యుంచబడుటకుగల అర్హత నది తిరస్కరించుచున్నది. పంచకాండములలోని ఆఖరి పుస్తకముపై యుద్ధము చేయుట కది తన నమ్మకభటులగు 'ఆధునిక వేత్తలను' నియమించుచున్నది.

క్రొత్త నిబంధన వ్రాయబడక ముందే దానిని కూడ యేసు ఆమోదించెను. అపొస్తలులు ఏమి చెప్పవలెనో ఎట్లు చెప్పవలెనో అను వాటిని పరిశుద్ధాత్ముడు వారికి తెలియజేయుననియు (మత్తయి 10:19), మరియు వారిని సర్వసత్యములోనికి నడిపించుననియు (యోహాను 16:13) యేసు వారికి వాగ్దానము చేసెను. పెంతెకొస్తు దినమున ఆత్మ అపొస్తలుల మీదికి వచ్చెను. ఆయన వారికిచ్చిన శక్తికొలది వారు మాటలాడసాగిరి (అపొ. కా. 2:4). థెస్సలొనీకయులు దేవుని వర్తమాన వాక్యము నంగీకరించినప్పుడు మనుష్యుల వాక్యమని యెంచక అది నిజముగా యున్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీక

రించిరి గనుక పౌలు వారిని మెచ్చుకొనెను (1 థెస్స 2:13). అతడు మనుష్య జ్ఞానము నేర్పు మాటలతోగాక ఆత్మ నేర్పు మాటలతో బోధించెను (1 కొరింథి 2:13). యోహాను వ్రాసిన లేఖనములను గూర్చి చెబుతు సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాటలను చదువరులు వినవలెనని హెచ్చరించెను (ప్రకటన 2:11). యేసు వాగ్దానము చేసిన పరిశుద్ధాత్మ నడిపింపునే తాము కలిగియున్నామని అపొస్తలులు చెప్పుకొనిరి. బైబిలు అంతయు దైవావేశము వలన కలిగినదని చెప్పుటకు యితర లేఖనములను కూడ చెప్పుకొనవచ్చునుగాని యివి చాలును.

(తరువాయి వచ్చే సంచికలో)

---

# సువర్తమానము

## *(GOOD NEWS)*

ఏ భేదము లేదు, అందరు పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు (రోమా 3:23). ఏలయనగా పాపము వలన వచ్చు జీతము ఆత్మీయ మరణము. (రోమా 6 : 23, 5:12). మనుష్యుడు తనపాపస్థితినిబట్టి దేవునినుండి దూరపర్చబడెను(యెషయా 59:1-2). కావున మానవుడు దారి తప్పి, చెడిపోయి, నిరాశపరుడై ఆత్మీయ మరణమునకు గురియాయెను (ఎఫెసీ 2 : 1). ఏ మానవుడు తనంతట తాను యిట్టి ఆత్మీయ మరణమునుండి తప్పించుకొనజాలడు. మన ఆది తలిదండ్రులైన ఆదాము, హవ్వలు ఏదేను వనములో దేవుని ఆజ్ఞను మీరిన దినమే వారిరువురు ఆత్మీయంగా మరణించిరి. శారీరకముగా వారు జీవించుచున్నప్పటికీ ఆత్మీయకంగా చచ్చినవారైరి.

మానవులందరియొక్క ఆత్మీయ పరిస్థితి యిదే. అందరు పాపము చేసి, దేవుడనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. పాపము దానియొక్క ఫలితము విశ్వగోచరమైనది. అన్ని దేశములవారు, అన్ని భాషలవారును పాపఫలితముగా శిక్షార్హులు.

## పాపము ఆత్మీయ జీవితమును నశింపజేయును.

పాపమనునది మానవుని విషాద గాథ. మానవకోటి పాషాణము. దేశముయొక్క శాపము. జీవితంయొక్క కుష్టు. మానవ సమాజంయొక్క పీడిత రోగము. మన ఆత్మలయొక్క కేన్సరు. మన మనస్సులను కలుషితము చేసి, ప్రతి మానవుని భయకంపితుని జేయునది పాపమే.

మానవుడు చేయు ఏ పుణ్య కార్యము వలనను తన్ను తాను రక్షించుకొనజాలడు. మనలో ఎవ్వడును తనంతట తానే పాపము నుండి విడుదల పొందజాలడు (తీతు 3:5; రోమా 3:10). మానవుని తత్వ జ్ఞానము, విజ్ఞానము లేక వాని సాంఘిక అంతస్తు అతనిని పీడించెడి పాప రోగము నుండి ఆత్మను బాగుచేయ జాలదు (యిర్మీయా 10:23). గాన మన సహాయం కొరకు, రక్షణకొరకు రోదనం చేయవలసి ఉన్నది. కాని ఎవరు సహాయం చేయుదురు?

ఇట్టి కార్యము చేయగలిగినవాడు పాపరహితుడు, రక్షకుడైన యేసుక్రీస్తే. పాపమువలన వచ్చు ఫలితము మరణము. ఇది దేవుని యొక్క నిత్యమైన తీర్పు; ప్రేమ, కృప వలన యేసు ప్రభువుద్వారా రక్షణ అనుగ్రహింప బడినది (హెబ్రీ 2:9).

## యేసుప్రభువు మానవులకొరకు ప్రాయశ్చిత్తము చేసెను

ఇది ఏలాగు జరిగెను? ఏ పాపములేని యేసుప్రభువు నీ కొరకు, నాకొరకు ప్రాయశ్చిత్త బలిగా చేయబడెను. ఆయన తన శరీరమందు మన పాపములను సిలువ మ్రానుమీద మోసెను (1 పేతురు 2:24). "పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21). "అతడు తనను తానే అపరాధ పరిహారార్థ బలిగా చేయగా" (యెషయా 53:10). "నీతిమంతుడైన నా సేవకుడు జనుల దోషమును భరించెను" (యెషయా 53:11). పాపమునకు క్రీస్తుద్వారా ప్రాయశ్చిత్తము చేయబడినది.

యేసుప్రభువు తప్ప వేరే మార్గములేదు. కావున మానవుడు యేసుప్రభువునందు విశ్వాస ముంచవలెను. ఆయన మనకొరకు చేసిన ప్రాయశ్చిత్తమును అంగీకరించవలెను. ఏవిధమైన సందేహం, ఆందోళన మనము చెందనవసరం లేదు. "మనలను ప్రేమించుచు, తన రక్తము వలన మన పాపముల నుండి మనలను విడిపించిన వానికి మహిమయు, ప్రభావమును యుగ యుగములు కలుగునుగాక!" ఆమెన్ (ప్రకటన 1 : 6).

## విశ్వసించి విధేయులు కావలసి యున్నది

ఈ శుభ వర్తమానమును నీవు అంగీకరించెదవా? ఆయనయందు విశ్వాసముంచి రక్షింపబడెదవా? (యోహాను 3:16). యేసుప్రభువు ఇట్లనెను : "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధించబడును" (మార్కు 16:16). "మీరు మారుమనస్సు నొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపో. కా. 2:38).

ఎంత మహిమగల శుభవర్తమానము! యేసుప్రభువును నీ హృదయ పూర్వకముగా విశ్వసించి, ఆయనను నీయొక్క ప్రభువుగా అంగీకరించి సంపూర్ణ విధేయతను చూపిన యెడల ఆయన నీ పాపములను క్షమించును (హెబ్రీ 5:8, 9, 10). క్రీస్తు ప్రభువు యొక్క రక్తమువలన విమోచింపబడిన సంఘమునందు చేర్చును. ఆయన పుణ్యరక్తము మనలను మన పాపముల నుండి విమోచించి పవిత్రులుగా చేయును (1 యోహాను 1:7).

నీ రక్షణ విషయము ఆలస్యం చేయవద్దు. నీయందు నీవు నమ్మిక యుంచుకొనవద్దు. నీవు చేయు కార్యములందు నమ్మిక యుంచుకొనవద్దు. నీపాపముల కొరకు బలియైన యేసుప్రభువును నమ్మి ఆయనయందు విశ్వాసముంచుము. యేసుప్రభువును నమ్ముట అనగా ఆయనయందు

విశ్వాసముంచి, ఆయనకు విధేయులు కావలయును. ఆత్మ రక్షణకు వేరు మార్గము లేదు.

యేసు చెప్పెను: —"నేనే మార్గము, సత్య ము, జీవము నై యున్నాను. నా ద్వారా తప్ప ఎవ్వడును తండ్రి యొద్దకు రాడు" (యోహాను 14:6).

—నికోలస్ పీటర్‌సన్, పాలకొల్లు.

---

## అనేకులకు శుభవార్త

### *(Good News for Many)*

''ఆ స్త్రీ తనకుండ విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్లెను'' (యోహాను 4:28)

ఒక సామాన్య పట్టణములో సామాన్య మానవ స్త్రీ ఒకతె ఒక అసామాన్య పనిచేసింది. ఆమె సినిమా చూడడానికి, నవల చదువడానికి, కబుర్లతో కాలక్షేపం చేయడానికి ఊరిలోనికి వెళ్ల లేదు గాని క్రీస్తుయొక్క శుభవర్తమానమును ఇతరులతో పంచుకొనడానికి ఆమె పురికొల్పబడింది. అందువలన "ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి. ఆ సమరయులు ఆయన యొద్దకువచ్చి తమ యొద్ద ఉండుమని ఆయనను వేడుకొనిరి గనుక ఆయన అక్కడ రెండు దినములుండెను. ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి, ఇకమీదట నీవు చెప్పిన మాటను బట్టికాక మామట్టుకు మేము విని యీయన నిజముగా లోక రక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి" (యోహాను 4:39-42).

### మనము గమనించదగిన కొన్ని అంశములు

1. స్త్రీలు పురుషులు కూడ తమ బంధుమిత్రులకు క్రీస్తును గూర్చి బోధింప వచ్చును, బోధింపగలరు.

2. ఆస్త్రీ విన్న వర్తమానము ఇతరులతో పంచుకొనదగినది. క్రీస్తు సువార్త మనము ఇతరులతో పంచుకొనదగినది కాదా?

3. ఆమె 'అనేకులకు' క్రీస్తును గూర్చి చెప్పుటకు భయపడ లేదు (39వ వచనము).

4. 'అనేకులు' ఆయన మాటలను వినుటకు ఆసక్తి కలిగియుండిరి. ఈనాడుకూడ అనేకులు ఆయన మాటలను వినుటకు చదువుటకు ఆసక్తి కలిగి యున్నారు.

5. అనేకులు ఆమె సాక్ష్యమును నమ్మిరి. వారే స్వయముగా యేసు మాటలను వినునరికి వారి విశ్వాసము బలపడెను. మనము క్రీస్తు సువర్తమానమును బోధించునప్పుడు ఆసక్తి, విశ్వాసములు రేకెత్తించ బడును. అప్పుడు స్వయముగా వినుటవలన, చదువుటవలన, విశ్వాస నిశ్చయతలు మరింత బలపడును. నీవున్న ఊరిలో ఎంతమంది నీద్వారా క్రీస్తు సువార్తను విన్నారు?

---

## క్రీస్తు సంఘమును దర్శించు నపుడు నీవేమి కనుగొందువు

## *( What to expect when you visit a Church of Christ )*

దేవుని ఆయన కుమారుడైన యేసుక్రీస్తుద్వారా ఆరాధించుటకు కూడియున్న క్రైస్తవులను నీవు కనుగొందువు. ఈ ఆరాధనలో పరిశుద్ధ లేఖనములు చదువబడుట, ప్రార్థన చేయుట, పాటలు పాడుట, ప్రభు రాత్రిభోజనము నాచరించుట, కానుక లిచ్చుట జరుగును. మొదటి శతాబ్దపు క్రైస్తవులను క్రీస్తు నడిపించినట్లుగా ఈ క్రైస్తవులు ఆరాధింతురు (యోహాను 4:24; 2 తిమో 2:15; 1 తిమో 2:8; ఎఫెసీ 5:19; అపొ. కా. 20:7; 1 కొరింథీ 16:1, 2).

ఆత్మావేశ దైవలేఖనముల యెడల సంపూర్ణ భయభక్తులు ఈ సంఘములు కలిగియుండుట నీవు చూడగలవు. నేటి భక్తివిషయాల్లో

అది ఒక్కటి మాత్రమే సంపూర్ణాధికారమును కలిగియున్నది. "ఒకడు బోధించిన యెడల దైవోక్తులను బోధించునట్టు బోధింపవలెను" (1 పేతురు 4:11). ఒకే నియమమును బట్టి మనందరము నడుచుకొనవలెను (ఫిలిప్పీ 3:16). దేవుని వాక్యము సర్వసంపూర్ణమైన విశ్వాస నియమమని క్రీస్తు సంఘములు అంగీకరించును గనుక మానవ ప్రమాణికములను అన్నిటిని వారు నిరాకరించుట నీవు చూడగలవు (గలతీ 1:8, 9; ప్రకటన 22:18, 19).

'ఈ బండమీద నా సంఘమును కట్టుదును' అని క్రీస్తు ప్రకటించినందున (మత్తయి 16:18), క్రీస్తు సంఘములు ఆయనకే చెందినట్టివని గుర్తించబడెను (రోమా 16:16). ఈ సంఘములలో ప్రతివాడు ప్రభువు ఆజ్ఞలకు లోబడవలెనని వేడుకొనబడుట నీవు కనుగొందువు: అవి క్రీస్తునందు విశ్వాసముంచుము (యోహాను 8:24), మారుమనస్సు పొందుము (లూకా 13:3), క్రీస్తును ఒప్పుకొనుము (మత్తయి 10:32), క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము (మార్కు 16:16; అపో. కా. 2:38). క్రైస్తవుడుగాను, ప్రభువు సంఘసభ్యుడుగాను అగుటకు ఈ ఆజ్ఞలకు లోబడవలెను. క్రైస్తవులయిన తరువాత క్రొత్త నిబంధన నడిపించురీతిగా ఈ శిష్యులు ప్రభువును నమ్మకముగా ఆరాధించుచు, సేవించుచు యుండవలెను.

క్రీస్తును వెంబడించు వారందరు క్రొత్త నిబంధనలో బయలుపరచబడిన రీతిగా ఆదిమ క్రైస్తవ నమూనా యొద్దకు మరలుడి యని సువార్త బోధకులు విజ్ఞాపనచేయుట నీవు కనుగొనగలవు. రాజ్యము యొక్క విత్తనము దేవుని వాక్యము గనుక (లూకా 8:11), మనుష్యుల హృదయములో అది ఒక్కటి మాత్రమే నాటబడినప్పుడు మొదటి శతాబ్దములో అది యెట్టి ఫలితముల నిచ్చెనో అదే ఫలితములను ఇప్పుడును ఈయగలదని వారి నమ్మకము! ఆ ఫలితము క్రొత్త నిబంధన క్రైస్తవ్య మగును.

దేవుని సేవించు ఈ ప్రాథమిక పద్ధతిని క్రీస్తు సంఘములు అందరికి అందియ్య గోరుచున్నవి. క్రీస్తునందు క్రైస్తవ ఐక్యతకు సహవాసముకు ఇది ఒక్కటి మాత్రమే సరియైన జవాబు అని ఈ క్రైస్తవుల విశ్వాసము (ఎఫెసీ 4:5; 1 కొరింథీ 1:10).

---

## ఈ రోజు ఒక గొప్ప రోజు

## *( Today is a Great day )*

ప్రాముఖ్యమైన దానిని చదువుటద్వారా నా జ్ఞానమును అభివృద్ధి పరచుకొందును.

మర్యాదగాను సహాయకరముగాను ఇతరుల యెడల ప్రవర్తించెదను. ఒక క్రొత్త స్నేహితుని సంపాదించుకొందును, పాత స్నేహితుని ప్రోత్సాహింతును. నా కర్తవ్యమును నిర్వర్తించి మనశ్శాంతి కొరకు పాటుపడుదును.

సంతోషముగా యుండుటకు పనిచేతును, నా ఆందోళనలను వ్యక్తపరచక యుందును.

సాధ్యమైనంతమట్టుకు నా నాలుకను అదుపులో యుంచుకొందును. మరియు నేను నెరవేర్చగలిగిన వాగ్దానములనే చేతును.

ఇతరుల యెడల ఓర్పు కలిగియుందును. వారు చక్కగా చేసిన పనిని మెచ్చుకొందును. నా జీవితమును అభివృద్ధి పరచుకొనుచు ఇతరుల జీవితముకూడా అభివృద్ధి చెందునట్లు సహాయ పడుదును.

నేను మంచి పౌరునిగా యుండి నా సమాజ అభివృద్ధికి పాటుపడుదును. యేసు యిచ్చిన గొప్ప ఆజ్ఞను అనుసరించుచు, 'బంగారు సూత్రమును' పాటించెదను (మత్తయి 7:12).

యేసుక్రీస్తును, నాతోటి సహోదరుని గొప్ప విశ్వాస నిరీక్షణలతో ప్రేమించెదను. దేవుని సహాయముతో ఈ ఉద్దేశములను ఈ రోజు చక్కగా పాటించెదను.

---

# ముఖ్య ప్రకటన

క్రీస్తు సంఘముల ఆరాధనలో ఉపయోగింపబడు నిమిత్తము కీర్తనల పుస్తకము ముద్రించబడి 1981 నవంబరు 15వ తేదీ నుండి అమ్మకమునకు సిద్ధముగా యున్నది. సంఘములలో విరివిగా వాడబడుచున్న 281 పాత, క్రొత్త పాటలు ఇందులో చేర్చబడి ఆకర్షణీయముగా, దిట్టముగా బైండింగ్ చేయబడినది.

ఫుల్ క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు 5/- రూ॥లు

సగం క్లాత్ బైండింగ్ పుస్తకము ఖరీదు 4/- రూ॥లు

పోస్టేజీ అదనము.

రిజిష్టరు పోస్టు రు 2-50, ఆర్డినరీ పోస్టు 0-50 పైసలు మాత్రమే. స్వయముగా గాని, పోస్టుద్వారా గాని ఈ దిగువ స్థావరము నుండి పొందవచ్చును:

**SATYA VANI**

Seshagiri Rao Street, Ramaraopet,

KAKINADA – 533 004


# సత్యవాద ప్రియుడు

*( Lover of Veracity )*

సత్యము అను పదమును మన మనేకసార్లు ఉపయోగించెదము. మోసము, అబద్ధము, అనునవి దానికి వ్యతిరేకము. మనము ఏ విషయములోను మోసపోవలెనని కోరుకొనము గాని సత్యము చొప్పుననే చేకూరవలెనని అపేక్షింతుము. గనుక మన జీవితములకు సత్యము ఆవశ్యకమై యున్నది.

అందువలననే సొలొమోను యిట్లనుచున్నాడు: "సత్యమును అమ్మివేయక కొని యుంచుకొనుము." ఎందువలనంటే సత్యము దేవుని వలనైనది. దేవుని వాక్యము సత్యమై యున్నది. క్రీస్తు సత్యుడు. మరొకవైపు సాతానుడు అబద్ధికుడు, మోసగాడై యున్నాడు. వాని అనుచరులును మోసగాండ్రే యని 2 కొరింథీ 11:13-15 బోధించుచున్నది. "ఏ అబద్ధమును సత్యసంబంధమైనది కాదు" (1 యోహాను 2 : 21).

"సత్యవాద ప్రియుడు నీతిగల మాటలు పలుకును; కూటసాక్షి మోసపు మాటలు చెప్పును" (సామె 12:17). అంటే దేవుని సంబంధి సత్యము బోధించును, అపవాదుని సంబంధి మోసపు బోధలు చేయును. కడవరి దినములలో కొందరు అబద్ధికుల వేషధారణ వలన మోసపరచు ఆత్మలయందును దయ్యముల బోధలయందును లక్ష్యముంచెదరు యని ఆత్మ తేటగా చెప్పి యున్నాడు (1 తిమోతి 4:1). "...దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను నశించుచున్నవారిలో సాతానుడు కనుబరచు బలమును అనుసరించి యుండును; ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతియందు అభిలాష గల వారందరును శిక్షావిధి పొందుటకై మోసముచేయు శక్తిని దేవుడు వారికి పంపుచున్నాడు" (2 థెస్స 2:10-12). ఇట్టి మోసగాండ్రు అంత్యమేమనగా — "అబద్ధమును ప్రేమించి జరిగించు ప్రతివాడును వెలుపట నుండును" (ప్రకటన 22:15). అబద్ధ ప్రియులకు శిక్ష నరకమే!

## సత్యమును ప్రకటించిన పౌలు

సత్యుడైన క్రీస్తు యొక్క సేవకుడగు పౌలు యిట్లనుచున్నాడు: "మనలను దాసులుగా చేసికొనవలెనని క్రీస్తు యేసువలన మనకు కలిగిన మన స్వాతంత్ర్యమును వేగు చూచుటకు రహస్యముగా తేబడి దొంగతనముగా ప్రవేశించిన కపట సహోదరుల వలన జరిగినది.

సువార్త సత్యము మీ మధ్యను నిలుచునట్లు మేము వారికి ఒక్క గడియయైనను లోబడుటకు ఒప్పుకొనలేదు" (గలతీ 2:4, 5). "మేము సత్యమునకు విరోధముగా ఏమియు చేయనేరముగాని సమస్తమును సత్యము నిమిత్తమే చేయుచున్నాము" (2 కొరింథీ 13:8). "మేము ఎవరికిని అన్యాయము చేయలేదు, ఎవనిని చెరుపలేదు, ఎవనిని మోసము చేయలేదు" (2 కొరింథీ 7:2). పౌలు సత్యమును మాత్రమే ప్రక టించెను. అందువలన అతడు న్యాయాధిపతి నుండి నీతి కిరీటము పొందనై యున్నాడు. సత్యము ప్రేమించి గైకొను ప్రతి వానికిని ప్రభువు బహుమానము నిచ్చును!

## క్రీస్తు సంఘము సత్యమునకు స్థంభము

క్రీస్తు యొక్క సంఘము సత్యమునకు స్థంభమును ఆధార మునై యున్నది (1 తిమోతి 3:15). క్రీస్తు శిరస్సుగా గల సంఘము ఒక్కటే; అదియే సత్యసంఘము; ఒక్కటేయైన సంఘమునకు ప్రభువు ఒక్కడే; ప్రభువు యొక్క ఒకే సంఘములోనికి ప్రవేశించుటకు బాప్తిస్మము ఒక్కటే; సరియైన ఒకే బాప్తిస్మము పొందిన వానికి నిరీక్షణ ఒక్కటే; పరలోకమే, నిత్యజీవమే వాని నిరీక్షణ (ఎఫెసీ 4:4, 5).

నీవు క్రీస్తు సంఘ సభ్యుడవా? కాని యెడల సత్యమునకు విధేయుడవై క్రైస్తవుడ వగుము. అప్పుడు "ప్రేమ కలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు మన మన్ని విషయములలో ఎదుగుదుము" (ఎఫెసీ 4:15). —S. P. దాస్.

## క్రొత్త నిబంధన

### (*The New Testament*)

దేవుని యొక్క క్రొత్త నిబంధన వాక్యము తన కుమారుడైన క్రీస్తుద్వారా అనుగ్రహింప బడినది (హెబ్రీ 8:6-13; 1:1-2; 12:24). అపొస్తలులు పరిశుద్ధాత్మ ప్రేరేపణచే మొదట దానిని నోటితో ప్రకటించి తరువాత వ్రాతలందుంచిరి (2 పేతురు 1 : 21; యోహాను 20:30-31).

మొదటగా నోట పలుకబడిన వర్తమానము సూచక క్రియల చేతను, మహత్కార్యముల చేతను స్థిరపరచబడెను (హెబ్రీ 2:3, 4;

మార్కు 16:20). ఆ వర్తమానము లిఖించుట ముగియగానే "క్రీస్తు యేసునం దుంచవలసిన విశ్వాసముద్వారా రక్షణార్థమైన జ్ఞానమును లోకమునకు యిచ్చుటకై" ఆ వాక్యము సర్వకాలములకు భద్రపరచబడెను, మరియు క్రైస్తవులు ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండుటకు అది ప్రయోజనకరముగా యున్నది (2 తిమో 3 : 16, 17).

దేవుని క్రొత్త నిబంధన వాక్యము పరిశుద్ధులకు ఒక్కసారే అప్పగింపబడిన బోధయై యున్నది (యూదా : 3). ఇది యేసుక్రీస్తు చే బయలుపరచబడిన సువార్తయై యుండి (గలతీ 1:11-12), ఇతరులకు బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపబడినది (2 తిమో 2:2).

—'పునరుద్ధరణ దూత' నుండి సేకరణ.

---

*From*

**SATYA WAKKU**
**P.O. Box 80**
**KAKINADA–533 001**

**BOOK-POST**
**Printed Book only**

**To**

..........................................
..........................................
..........................................
..........................................